సూర్య
నేటి దినపత్రిక
18వ వసంతం
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
బుధవారం,26 మార్చి 2025 8 పేజీలు

# పోలీసుల పేరుతో బెదిరించిన 8 మంది

## బజాజ్ ఏజెన్సీ ప్రతినిధుల అరెస్టు



**ఏలూరు,మేజర్‌న్యూస్:** పోలీసు అధికారుల పేరుతో లబ్ధిదారులను బెదిరింపులకు పాల్పడుతూ సొమ్ములు వసూలు చేస్తున్న 8 మంది బజాజ్ సంస్థ ఏజెన్సీ ప్రతినిధులను ఏలూరులోని శాంతినగర్ 12వ రోడ్లో గల బజాజ్ ఏజెన్సీ కార్యాలయంలో త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను మంగళవారం ఏలూరులోని డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎస్సై రాంబాబు, ప్రసాద్ లతో కలిసి వివరాలు డిఎస్పి డి.శ్రావణ్ కుమార్ వెల్లడించారు. గత కొంతకాలంగా జిల్లాలో బజాజ్ సంస్థలో వస్తువులు కొనుగోలు చేసిన వినియోగదారుల నుండి సొమ్ములు రికవరీ చేసే విషయంలో నకిలీ మొబైల్ సిమ్ లను వినియోగిస్తూ పోలీస్ అధికారులు, ఇతర అధికారుల పేర్లు చెప్పు బెదిరింపులకు పాల్పడుతూ వినియోగదారుడు చెల్లించాల్సిన దానికంటే అధికంగా సొమ్ములు వసూలు

- తరువాయి 2లో..





# జిల్లా కలెక్టర్ల సదస్సులో

## పాల్గొన్న కలెక్టర్,ఎస్‌పి

**అమరావతి/ఏలూరు,మేజర్‌న్యూస్ :** వెలగపూడిలోని సచివాలయంలో మంగళవారం,బుధవారంలలో రెండు రోజులపాటు జరగనున్న జిల్లా కలెక్టర్ల సమావేశం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం ప్రారంభమైంది. ఈసమావేశంలో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్,డిజిపి హరీశ్ కుమార్‌గుప్తా,వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపెరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు. ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, పోలీసు సూపరింటెండెంట్ కె. ప్రతాప్ శివ కిషోర్ పాల్గొన్నారు.

# 3వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో

## కలెక్టర్, ఎస్పీ



**అమరావతి/భీమవరం,మేజర్‌న్యూస్ :** అమరావతి రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు జరుగనున్న 3వజిల్లా కలెక్టర్ల సమావేశంమంగళవారం ఉదయం ప్రారంభమైంది. ఈసమావేశంలో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డిజిపి హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు.



# కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న మంత్రులు పార్థసారథి, రవి కుమార్

**అమరావతి/ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర సచివాలయంలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో సహచర మంత్రులతో కలిసి పాల్గొన్న రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి. పశ్చిమ గోదావరి జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా చిత్రంలో చూడవచ్చు.

## ముఖ్యమంత్రి పర్యటన

# విజయవంతం చేయాలి

**- పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించిన జెసి ధాత్రిరెడ్డి**





**పోలవరం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు పర్యటన నేపథ్యంలో ఆయా ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పరిశీలించారు.ఏ.ఎస్.ఎల్. నిర్వహణలో భాగంగా మంగళవారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతలో సీఎం పర్యటించే పలు ప్రాంతాల్లో ఏర్పాట్ల పరిశీలన చేశారు.ఈనెల 27వ తేదీ పోలవరంలో పర్యటించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జెసి పి.ధాత్రిరెడ్డి అధి కారులను ఆదేశించారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో పర్యటించిన అనంతరం అధికారులకు ఆమె పలు సూచనలు జారీచేశారు.పోలవరంప్రాజెక్ట్ వ్యూపాయిం ట్ వద్ద నున్న హెలీప్యాడ్ ఏర్పాట్లు, ప్రాజెక్ట్ పురోగతి పనులు సందర్శించే ప్రాంతాలను, పార్కింగ్, విఐపి గ్యాలరీ, ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించే సమావేశపు హాలు,తదితర ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి వారికి కేటాయించిన విధులలో ఎటువంటి పొరపాట్లు జరుగకుండా అధికారులందరూ సమన్వయంతో తగు జాగ్రత్తలు తీసుకొని ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పి ఎన్.సూర్యచంద్ర

- తరువాయి 2లో..

# పిల్లల అక్రమ రవాణా కట్టడికి

## కఠిన చర్యలు

- ప్రతి పోలీస్ స్టేషన్లో మహిళా హెల్ప్ డెస్క్ ఏర్పాటు
- 1098 హెల్ప్ లైన్ నెంబర్ ఏర్పాటు
- ఎంపీ పుట్టా మహేష్‌కు కేంద్ర మంత్రి సమాధానం



**దిల్లీ /ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశవ్యాప్తంగా గత పదేళ్లలో పిల్లల అదృశ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుతీసుకున్న చర్యలు, పిల్లలను అపహరించిన దోషులకు శిక్షలు విధించడం, ఆచూకీ లభించిన పిల్లలకు పునరావాసం,సహాయక చర్యలపై పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర హెూం వ్యవహారాల మంత్రిత్వశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మంగళవారం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాలు నివేదించిన నేరాలపైగణాంకాలవివరాలు సేకరిస్తుం దని, పోలీస్,పబ్లిక్ ఆర్డర్ భారత రాజ్యాంగంలోని ఏడవషెడ్యూల్ కింద శాంతిభద్రతల పరిరక్షణ, పిల్లల సంరక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంటుందని కేంద్ర మంత్రి బదులిచ్చారు. హెూం వ్యవహారాల మంత్రిత్వశాఖ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు అనుసంధానంగా ఉంటుందని, ప్రస్తుతం ఉన్న యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లను బలోపేతంచేయడంలో భాగంగా ప్రతిపోలీస్ స్టేషన్‌లో మహిళా హెల్ప్ డెస్క్ ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు అన్నిస్థాయిలలో మానవ అక్రమ రవాణాపై అవగాహనకార్యక్రమాలను నిర్వహిస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. అదృశ్యమైన నిరుపేద పిల్లలకు అత్యవసర సేవలు అందించడం కోసం మహిళా,శిశుఅభివృద్ధిమంత్రిత్వశాఖ ఆధ్వర్యం లో హెల్ప్‌లైన్ నంబర్ 1098 24/7 పని చేస్తుందని, తక్షణ సాయం అందించడానికి ప్రధాన రైల్వే ప్లాట్‌ఫారమ్‌ల వద్ద రైల్వే చైల్డ్ లైన్‌లు నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి

- తరువాయి 2లో..

# ఘనంగా జనసేన పార్టీ నాయకులు ఆకుల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



- ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్

కాకినాడ, మేజర్‌న్యూస్ : జనసేన పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక 38వ డివిజన్ ఇన్‌చార్జ్ ఆకుల శ్రీనివాస్ జన్మదిన సందర్భంగా ఆయన అభిమానులు భారీ ఎత్తున వేడుకలు నిర్వహించి కేక్ కటింగ్ చేయించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన ప్రముఖ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సారధ్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రక్త పరీక్షలు, వైద్య పరీక్షలు చేపట్టి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. అలాగే నేత్ర పరీక్షలు నిర్వహించి దృష్టి లోపాలకు కళ్ళద్దాలు అవసరం, శస్త్ర చికిత్స ఆవశ్యకత తెలియజేశారు. అలాగే ప్రముఖ దంత ఆసుపత్రి పార్ధ కు చెందిన వైద్యులు తమ సేవలు ఉచితంగా అందజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ క్రమశిక్షణకు, సామాజిక సేవే లక్ష్యంగా ముందుకు సాగుతుందని అన్నారు.రాష్ట్రంలో ఏ కార్యకర్త ఇంట్లో ఏ కార్యక్రమం జరిగినా అది సమాజానికి ఉపయోగపడే విధంగా రూపకల్పన చేసుకోవడం ఒక్కజనసేన పార్టీకి మాత్రమే సాధ్యమవు తుందని తెలిపారు. ముఖ్యంగా స్థానిక 38వ డివిజన్ నాయకులు ఆకుల శ్రీనివాస్ సామాజిక సేవాశ కార్యక్రమంలో కార్యక్రమాలు చేపట్టడంలో ముందుంటారని తెలిపారు. ఈసారి జన్మదిన వేడుకల్లో భారీ ఎత్తున వైద్య శిబిరం, అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. అనంతరం ఆకుల శ్రీనివాసుకు జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చోడిశెట్టి శ్రీమన్నారాయణ, వాడ్రెవు లోవరాజు, బడే వేంకట కృష్ణ, బండి సుజాత, రచ్చ ధనలక్ష్మి, దీప్తి, బోడపాటి మరియా తదితరులు ఉన్నారు.

# రోడ్డుపై గుట్టలు తొలగించరూ

**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సామర్లకోట పట్టణ పరిధిలో ఇటీవల నిర్మించిన కల్వర్టుల ప్రాంతంలో మట్టి గుట్టలు తొలగించకపోవడంతో ప్రజలు ప్రమాదాలు బారిన పడుతున్నారు. కల్వర్టుల నిర్మాణం జరిగి నెలలు గడుస్తున్న మున్సిపల్ సిబ్బంది మట్టిగుట్టలను తొలగించక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సామర్లకోట పట్టణంలోని నెంబర్ టు మార్కెట్లో విగ్నేశ్వర థియేటర్ కి వెళ్లే ప్రాంతం వద్ద కల్వర్ట్ నిర్మాణ పనుల సమయంలో తవ్వి రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టి గుట్టలు, స్థానిక నీలమ్మ చెరువు వద్ద తోట గోపాలకృష్ణ ఉన్నత పాఠశాలకు వెళ్లే మూడు రోడ్ల కూడలిలో, పాఠశాల గేటు వద్ద కల్వర్ట్ నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాటుచేసిన మెటీరియల్ వ్యర్థాలు, తొలగించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే సామర్లకోట-ఉండూరు ప్రధాన రహదారిలో కొద్ది నెలల క్రితం పట్టణ ప్రజలకు త్రాగునీరు సరఫరా చేసే ప్రధాన పైప్లైన్ కు లీకులు ఏర్పడగా దానికి రిపేర్లు చేపట్టే క్రమంలో రోడ్డుకు మధ్యలో ఏర్పాటు చేసిన బారికేడ్ లను తొలగించకుండా వదిలిపెట్టారు. దానితోపాటు పైప్లైన్ నిర్మాణ ప్రాంతంలో గోతులు ఇసుకతో కప్పి వేసి



తారు రోడ్డు గాని, సిసి రోడ్డు గానీ నిర్మించకుండా వదిలిపెట్టడంతో రాత్రి సమయాల్లో ఆ రోడ్డున ప్రయాణించే వాహనదారులు గోతిలో పడి గాయాల పాలవుతున్నారు. ఈ దృశ్యాలు నిత్యం మున్సిపల్ అధికారులకు సైతం దర్శనమిస్తున్నా వారు వాటిని పట్టించుకోకపోవడంతో ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. తక్షణమే అవరోధంగా ఉన్న మట్టి గుట్టలను తొలగించి ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# అలేఖ్యకు ఉపకులపతి ప్రసాద్ అభినందన





కాకినాడ, మేజర్ న్యూస్ : ఆదిత్య యూనివర్సిటీలో ఈనెల 21వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 పోటీలలో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) లోని ఎంసిఏ ఆఖరి సంవత్సరం విద్యార్థిని జి.ఎన్.ఎస్.అలేఖ్యను ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం ఉదయం విసి ఛాంబర్ నందు రాష్ట్రస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ -2025 పోటీలకు ఎంపికైన జి.ఎన్.ఎస్.అలేఖ్యను అభినందించి రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత నుండి ప్రేరణ పొందిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఈకార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంద న్నారు. వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ అనేది యువత జాతీయ స్థాయి చర్చలలో పాల్గొనడానికి మరియు వికసిత్ భారత్-2047 కోసం విజన్ డాక్యుమెంట్ రూపొందించేందుకు ఒక మంచి వేదిక అన్నారు. ఇది నాయకత్వం, పౌర భాగస్వామ్యాన్ని, విధాన చర్చలను ప్రోత్సహించడంతో పాటు కీలకమైన జాతీయ సమస్యలపై విద్యార్థులు చర్చించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈనెల 28వ తేదీన గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్ర స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలన్నారు.ఈ కార్యక్రమంలో యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్స్) ప్రొ.జివిఎస్ఆర్.దీక్షితులు, జెఎన్‌టియుకె ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా.జి.శ్యామ్‌కుమార్, యుసిఇకె ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.వి.ఎస్.వి.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## బి.ఎన్.సిహెచ్.వి.చక్రవర్తికి జెఎన్టీయుకె పిహెచ్‌డి



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** నిపుణుల బృందం సిఫార్సు మేరకు బి.ఎన్.సిహెచ్.వి.చక్రవర్తి సిద్ధాంత వ్యాసం "స్టెబిలిటీ అండ్ పెర్ఫార్మెన్స్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ నోవల్ డబుల్ బూస్ట్ డిసి-డిసి కన్వర్టర్ అండ్ మల్టీలెవెల్ డిసి-ఏసి కన్వర్టర్ ఫర్ ఏ పివి బేస్డ్ మైక్రో గ్రిడ్ అప్లికేషన్స్' జెఎన్టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో లభించినది. బి.ఎన్.సిహెచ్.వి.చక్రవర్తి తన సిద్ధాంత వ్యాసాన్ని విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా. జి.వి.శివ కృష్ణారావు ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

## పోలీసుల పేరుతో బెదిరించిన 8 మంది బజాజ్ ఏజెన్సీ ప్రతినిధుల అరెస్టు

మొదటిపేజీ తరువాయి

చేసిన సాదిక్ మేనేజ్మెంట్ సర్వీస్ ఏజెన్సీ ప్రతినిధులు. వీరి ఆగడాలపై విస్తు చెందిన దుగ్గిరాలకు చెందిన గోవింద అనే వ్యక్తి ఏలూరు త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో ఆలస్యంగా అసలు విషయం వెలుగుచూసింది. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 8 లాప్టాప్‌లు,8 కంప్యూటర్లు, 19 మొబైల్ ఫోన్లు,ఒక రూటర్ బాక్స్,ఒక డిజిటల్ వీడియో తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి

రావు,జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎం.వి.రమణ, పోలవరం డిఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు, డీయం సివిల్ సప్లైస్ ఎ.శ్రీలక్ష్మి,డి ఎస్ వో ప్రతాపరెడ్డి, డిసిహెచ్ డా.పాల్ సతీష్,జిల్లా ఫైర్ ఆఫీసర్ సి హెచ్.రత్నబాబు, ఏపి ఈపిడిసిఎల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు, పోలవరం ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పిల్లల అక్రమ రవాణా కట్టడికి కఠిన చర్యలు

మొదటిపేజీ తరువాయి

సమాధానం ఇచ్చారు.మహిళా,శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ "ట్రాక్ చైల్డ్ పోర్టల్"ను కూడా ప్రారంభించిందని,అదృశ్యమైన, ఆచూకీ లభించిన పిల్లలను ట్రాక్‌చేయడానికివీలు కల్పిస్తుం దని,పోలీసు స్టేషన్లు, జువైనల్ జస్టిస్ బోర్డులు, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్లకు లాగిన్‌లు ఇవ్వడం వల్ల అదృశ్యమైన పిల్లల గురించి సమాచారాన్ని పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తారని వివరించారు.

## శ్రమదానం చేసిన నన్నయ వీసీ

**రాజానగరం, మేజర్‌న్యూస్ :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ క్యాంపస్ ప్రాంగణంలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో కలిసి ఇటుకలు మోశారు. మంగళవారం యూనివర్సిటీ లోని యూనియన్ బ్యాంక్ పక్కన వాహనాలపార్కింగ్‌కొరకు ప్రాంగణాన్ని శుభ్రపరచే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎన్.ఎస్.ఎస్. యూనిట్ మరియు ఇంజనీరింగ్‌కాలేజ్ ఎన్.ఎస్.ఎస్. యూనిట్ 1 ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో వీసీ పాల్గొని విద్యార్థులతో కలిసి సిమెంట్ ఇటుకలు మోశారు. వీసీ నేరుగా రంగంలోకి దిగి పని చేయడంతో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, యూనియన్ బ్యాంక్ మేనేజర్ మరియు ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు చురుగ్గా శ్రమదానంలో పాల్గొన్నారు. చెత్తను వ్యర్థాలను వేరువేసి ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనదే అని గుర్తుచేశారు

## కస్తూరిబా బాలికల పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**చింతూరు,మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం లోని కస్తూరిబా బాలికల పాఠశాల నందు రానున్న విద్యా సంవత్సరంకి గానూ అడ్మిషన్లకు దరఖాస్తుల చేసుకునే విద్యార్థినిలు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి మంగళవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంకి గానూ పాఠశాలలో 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 2 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో (సిఈసి) గ్రూప్ లో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ సీట్లు దరఖాస్తును విద్యార్థులు ఆన్లైన్ లో చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం దరఖాస్తు ప్రక్రియ ఈనెల 22వతేదీ నుండి మొదలు అయిందని, వచ్చే నెల ఏప్రిల్ 11వ తేదీ వరకు గడువు ఉందని, అర్హులైన విద్యార్థులు ఆన్లైన్ సెంటర్ మరియు మీ సేవ కేంద్రాల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు.

# ఫోక్సో చట్టంపైన అవగాహన సదస్సు





**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనం నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ సంయుక్తముగా బాల్యవివాహాల నిరోధం,బాలల పై అత్యాచారాల నివారణ(ఫోక్సో) చట్టం పైన అవగాహన సదస్సును,పరిసర ప్రాంతాలలోని వివాహాల నిర్వహించే ఫాదర్లకు,విద్యాశాఖ రెవెన్యూ, స్వచ్ఛంద సంస్థల యాజమాన్యాలకు (ఎన్‌జిఓ), విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్య దర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ వివాహాలు నిర్వహించే పురోహితులు,పాస్టర్లు ,ఇమాములు తమ వద్దకు వచ్చి వివాహం నిర్వహించమని కోరిన వారి పూర్తి వివరాలు,చిరునామా వయసు ధ్రువీకరణ పత్రాలను క్షుణముగా పరిశీలించిన తర్వాతే మాత్రమే వివాహాలు జరిపించాలని తద్వారా ప్రస్తుత సమాజంలో ఎదుర్కొంటున్న బాల్య వివాహ వ్యవస్థను సమూలంగా నిర్మూలించవచ్చని సూచించారు, బాల్య వివాహాలు ఎవరి దృష్టికైన వచ్చిన ఆ వివరాలను దగ్గరలోని సంబంధిత అధికారులకుగానీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కాని తెలియజేయాలని సూచించారు.ఏ విధమైన న్యాయసహాయం అవసరమైన 15100 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించుకున్న తక్షణ సహాయం అందుతుందని సూచించారు.

ఈ కార్యక్రమంలో డి.సి.పి.ఓ.పి.సూర్య చక్రవేణి,ఎల్ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ,సిడబ్ల్యూ సి మెంబర్ పి.వెంకటేశ్వరరావు,క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ వినోద్,సభ్యులు రాజేశ్వరి,తదితరులు పాల్గొన్నారు.

# రైతులు సొసైటీ సేవలు వినియోగించు కోవాలి

– కె.జగ్గవరం సొసైటీ చైర్ పర్సన్ తీట్ల లక్ష్మణ్ రావు



**టి.నరసాపురం,మేజర్ న్యూస్:** రైతులు సొసైటీ సేవలు వినియోగించుకోవాలని కె.జగ్గవరం సొసైటీ అఫీషియల్ చైర్ పర్సన్ తీట్ల లక్ష్మణరావు కోరారు. కె జగ్గవరం సొసైటీ మహా జన సభ లక్ష్మణరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలను అందించడానికి కంప్యూటరీకరణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ నుంచి ఆన్ లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి అన్నారు. రైతులు డిపాజిట్లు వేసి సంఘ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. సంఘం బహుముఖ వ్యాపారాలతో దిన దినదినాభివృద్ధి చెందుతుందని లక్ష్మణరావు వివరించారు. సంఘ సిఇఓ తనగాల వీర వెంకయ్య మహా జన సభ ఎజెండాను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయాల సంస్థ మాజీ చైర్మన్ జయ్యవరపు శ్రీ రామమూర్తి,సొసైటీ మాజీ అధ్యక్షులు బొంతు సత్యనారాయణ,వాసిరెడ్డి మధు,లింగారెడ్డి శ్రీనివాస రావు,వెలిది గంగాధర రావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ఉంగుటూరు శాసనసభ్యులు పి ధర్మరాజు



ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: చిన్న వెంకన్న ఆలయానికి మంగళవారం ఉదయం ఉంగుటూరు శాసనసభ్యులు పెనుమత్స ధర్మరాజు విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు అధికారులు తూర్పు గోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ముఖమండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనాలు పలికి స్వామివారి ప్రసాదాలను జ్ఞాపికను అందించారు. ఈ క్రమంలో ఆలయ సిబ్బంది కూటమి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## 39 ఆధార్ కార్డులు నవీకరణ

**ఇరగవరం,మేజర్ న్యూస్ :** మండలంలో 59 ఆధార్ కార్డులు మార్పులు చేర్పులు అప్డేట్ చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.శ్రీనివాస్ తెలిపారు. రేలంగి 25, పేకేరు 20 కొత్తపాడు 17 నమోదు చేసినట్లు అయన చెప్పారు.

# పొలం పిలుస్తోందిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**పెదవేగి,మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిదిలోని ఏరువాక కేంద్రం, ఏలూరు సమన్వయ కర్త డా.కె.ఫణి కుమార్ ,శాస్త్రవేత్త (విస్తరణ) ఎన్.నాగేంద్ర బాబు మంగళవారం పెదవేగి మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో మండల వ్యవసాయ అధికారిని ఎం. ప్రియాంక ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సమన్వయ కర్త డా.కె.ఫణి కుమార్ మాట్లాడుతూ వరి,మొక్కజొన్న ,కొబ్బరి పంటలలో వివిధ నూతన వరి రకాల గురించి అలాగే పురుగులు ,తెగుళ్ల గురించిన రైతుల సందేహాలను నివృత్తి చేశారు. తదుపరి ఎన్.నాగేంద్ర బాబు, శాస్త్రవేత్త వరిని నేరుగా వెదజల్లే పద్ధతి సాగు విధానాన్ని వివరించి రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వనురల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.లలిత సుధ మాట్లాడుతూ రైతు సోదరలందరూ కూడా వేసవి అపరాలు సాగుచేసుకుని అదనపు ఆదాయం పెంచుకుని భూసారాన్ని పెంచడంలో భాగస్వాములు కావాలని కోరారు. తరువాయి పినకడిమి గ్రామంలో ఏరువాక కేంద్రం వారు వరి చిరుసంచులు యం.టి.యు 1426 బి.పి.టి 3082 పై నిర్వహిస్తున్న చిరుసంచుల ప్రదర్శనా క్షేత్రాన్ని సందర్శించి వరి రకాల గుణగణాలను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంకన్నగూడెం రైతు సేవా కేంద్రం సిబ్బంది సుందర్, పినకడిమి రైతు సేవా కేంద్రం విఎఎ సురేందర్ , పట్టుపరిశ్రమ సిబ్బంది కుమారి, రైతులు పాల్గొన్నారు.

## వాచ్ మెన్ పై దాడి కేసులో ముద్దాయిలకు నాలుగేళ్ల జైలు శిక్ష

**ఏలూరు,మేజర్ న్యూస్ :** లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో 2022 సంవత్సరం అక్టోబర్ 20,21 తేదీలలో రాత్రి ధర్మాజీగూడెం శివారులో ఉన్న ప్రభుత్వ మద్యం షాపు వద్ద నలుగురు ముద్దాయిలు దౌర్జన్యంగా అక్కడ వాచ్ మెన్ పై దాడి చేసి నిర్బంధించి వైన్ షాపులో ఉన్న మద్యం బాటిళ్లను దొంగిలించిన కేసులో మంగళవారం జిల్లా 5వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి న్యాయమూర్తి రాజేశ్వరి నలుగురు ముద్దాయిలకు జైలు శిక్ష విధించారు. ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్ 268/2022 అండర్ సెక్షన్ 342,458,395 కేసులో నలుగురు ముద్దాయిలు బోయిన సూర్య,తమ్మిశెట్టి గోపి,కోట శ్యామ్ కుమార్ ,కంభం అరవింద్ ముద్దాయిలను ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్న,ఏలూరు కోర్టు కానిస్టేబుల్,కోర్టు మానిటరింగ్ సెల్ వారు కోర్టుకు హాజరు పరిచారు. జడ్జి ముద్దాయిలకి ఒక్కొక్కరికి 4 సంవత్సరముల జైలు శిక్ష విధించారు. ఒక్కొక్కరికి 1500 రూపాయలు జరిమానాలను విధించారు. అనంతరం ఎస్సై వెంకన్న ముద్దాయిలను ఏలూరు సబ్ జైలుకు తరలించారు.

## విశ్వవిద్యాలయ క్యాంపస్ తనిఖీ చేసిన రిజిస్ట్రార్ సుధాకర్





తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ : నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ సుధాకర్ మంగళవారం అధికారికంగా నన్నయ విశ్వవిద్యాలయం సందర్శించారు. తాడేపల్లిగూడెం క్యాంపస్‌ను సందర్శించి విద్య, మౌలిక సదుపాయాలను ఆరా తీశారు. తన పర్యటన సందర్భంగా, ఆయన అధ్యాపకులతో సంభాషించారు. తరగతి గదులను, ప్రయోగశాలలను తనిఖీ చేసి వాటి స్థితిని సమీక్షించి, అవి విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో పరిశీలించారు. రిజిస్ట్రార్ మహిళా హాస్టల్ను కూడా సందర్శించారు. అక్కడ మెస్ సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థినులతో సంభాషించారు. హాస్టల్లో అందించిన సౌకర్యాల గురించి, ఆహారం, నీటిసరఫరా నాణ్యత పై దృష్టి సారించి, ఆరా తీశారు. విద్యార్థులు వారి జీవన పరిస్థితులను మెరుగు పరచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ వారికి హామీ ఇచ్చారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. అశోక్ క్యాంపస్లో ని అనేక అభివృద్ధి కార్యక్రమాల కోసం రిజిస్ట్రార్ను అభ్యర్థించారు. క్యాంపస్ అభివృద్ధికి కృషి చేయడానికి పరిపాలన తగిన చర్యలు తీసుకుంటుందని రిజిస్ట్రార్ హామీ ఇచ్చారు.

## ఛాంబర్స్ కళాశాల విద్యార్థులు ఇండస్ట్రియల్ టూర్ షార్ట్ విజిట్




**పాలకొల్లు, మేజర్ న్యూస్:** స్థానిక బి.ఆర్.ఆర్.అండ్ జికే ఆర్ ఛాంబర్స్ కళాశాల నుండి కామర్స్ అండ్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ స్టడీస్ బీకాం,బిబిఏ విద్యార్థులు, అధ్యాపకులు కలిసి నరసాపురం ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ ను అలాగే నర్సాపురం టాయ్ సెంటర్‌ని సందర్శించినట్లు తెలిపారు, బీబీఏ కరికులం భాగంగా ఇండస్ట్రియల్ టూర్ షార్ట్ విజిట్ ,ఈ లేస్ ట్రేడ్ సెంటర్ నందు ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీక్రాఫ్ట్స్ వారు నిర్వహించిన ఎగ్జిబిషన్ వీక్షించడం జరిగింది. ఇంటర్నేషనల్ లెస్ ట్రేడ్ సెంటర్ నిర్వాహకులు తులసి రావు,ఛాంబర్స్ కళాశాల విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ హస్త కళలు దేశీయ సాంప్రదాయ సంస్కృతులను ప్రతిబింబించే విధంగా ఉంటాయని వాటిని భవిష్యత్తు తరాలకు తీసుకెళ్లవలసిన బాధ్యత నేటి విద్యార్థిని విద్యార్థుల మీద ఆధారపడి ఉన్నదని, ఈ హస్త కళలను ప్రోత్సహించడం ద్వారా స్వయం ఉపాధి లభిస్తుందని తెలిపారు.విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు తులసి రావు,రాధాకృష్ణ కూలంకషంగా సమాధానాలు ఇచ్చారు.

# పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

**- కుక్కునూరు,వేలేరుపాడు మండలాలను యూనిట్‌గా గుర్తించి పరిహారం ఇవ్వాలి**

**- 18 ఏండ్లు నిండిన యువతి,యువకులందరికీ ఇవ్వాలి : సిపిఎం**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రవి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర ముఖ్య మంత్రికి,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి స్థానంలో మీరు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో,పనులు విషయంలో పరిశీలన చేసేందుకు మూడుసార్లు వచ్చియున్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పోలవరం ప్రాజెక్టుకి ప్రాధాన్యత ఇచ్చి మీరు రావడం ఆహ్వానించతగ్గదే. అయితే అదే క్రమంలో ఆ ప్రాజెక్టు నిర్మాణానికి తమ భూములు ఇచ్చి త్యాగం చేసిన నిర్వాసితుల యడల మీరు చూపుతున్న సవతి తల్లి వైఖరి మా పార్టీకి తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు నిర్వాసితుల సమస్యపై పోలవరం పర్యటనలో ఎక్కడా మాట్లాడలేదు. కనీసం నిర్వాసిత కాలనీలో సౌకర్యాలు లేక వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొనే ప్రయత్నం కూడా చేయలేదు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు.కుక్కునూరు, వేలేరుపాడు రెండు మండలాల్లో 159 గ్రామాలకుగాను కేవలం 39 గ్రామాలకు మాత్రమే పరిహారం ఇచ్చారు. కాంటూర్ లెక్కలు తప్పు అని 2022 గోదావరి వరదలు తేల్చాయి. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను యూనిట్‌గా తీసుకొని పరిహారం ఇవ్వడం ద్వారానే నిర్వహిసతులకు న్యాయం జరుగుతుంది. అలాగే 10 ఏళ్ళ క్రితం హామీ ఇచ్చిన ప్యాకేజీని ఇప్పుడు ఇవ్వడం సమంజసం కాదు,ప్రస్తుత ధరకు తగ్గట్లుగా పెంచి ఇవ్వాలి. ఇప్పుడేమో 41.15 కాంటూర్ కంటే ఎత్తు పెంచబోమని పార్లమెంట్ సాక్షిగా తీర్మానం చేస్తే, మన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలపారు. 2017 కటాఫ్ తేదిగా నిర్ణయించి 18 సంవత్సరం నిండిన వారికి మాత్రమే పరిహారం అని చెప్తున్న ప్రభుత్వం,నేటికీ పునరావాసం కల్పించకుండా ఆలస్యం చేసిన ఫలితంగా వీరి సంఖ్య క్రమేపి పెరుగుతునే ఉంది. జిల్లాకు ఒక రీతిలో కటాఫ్ తేదీ నిర్ణయించడం అన్యాయం.గతంలో 1.15 లక్షల ఇచ్చిన భూములకు 5 లక్షల రూపాయలు ఇవ్వాలి. గత ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకెజ్ 10 లక్షల హామీని ఈ ప్రభుత్వం అమలు చెయ్యాలి. వెంకటాపురం నుండి కుడుములపాడు వరకు రోడ్లని వెంటనే పూర్తి చేయాలని రవి కోరారు.

# ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యేలు

తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ : తాడేపల్లిగూడెం 1వ వార్డులో ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు. ఈ సందర్భంగా ఎపి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ?1కోటీ 35 లక్షల వ్యయంతో దాతల సహకారంతో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు మొదలుపెట్టడం జరిగిందని, మనం నిజాయితీతో పనులు చేసేటప్పుడు దాతలు సహకరిస్తారని, అందుకు ఇదే గొప్ప నిదర్శనమని, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. టెన్నిస్ కోర్టు ,షటిల్ కోర్టు , స్విమ్మింగ్ పూల్ ఇవన్నీ మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాల్లోనే ఇవి ఏర్పాటు చేసుకోవడం, ప్రజలు, దాతల సహకారంతో వీటన్నిటిని రెండు, మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ చుట్టుపక్క పరిసర ప్రాంతాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం తాడేపల్లిగూడెం. ఇండోర్ స్టేడియం



నిర్మించాలన్నది ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కల అని దుష్ట శక్తులు, తీవ్రవాదులు రావడం వల్ల అభివృద్ధి ఆగిపోయింది. చుట్టుపక్క పరిసర ప్రాంతాల్లో యువతీ, యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచడానికి ఇండోర్ స్టేడియం నిర్మాణం శరవేగంగా జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి రైల్వే ప్రాజెక్టులు

**- కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి**

**- లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు నివేదిక**



**దిల్లీ /ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి కీలకమైన రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు మంగళవారం అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదిక సమర్పించారు. భద్రాచలం - కోవ్వూరు బ్రాడ్ గేజ్ లైన్ (సత్తుపల్లి మార్గంగా) నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని.గుడివాడ జంక్షన్ - నూజివీడు - మధిర కొత్త రైల్వే లైన్ (నూజివీడు పట్టణం, విస్సన్నపేట మార్గంగా) నిర్మాణం.నూజివీడు రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధుల విడుదల - ముఖ్యంగా ప్రయాణీకుల నిరీక్షణ గదులు, మండపాలు, మరుగుదొడ్లు, ఎత్తు లిఫ్టులు, కూర్చునే బెంచీలు,24 గంటల టికెటింగ్ కౌంటర్ ఏర్పాటు.ఏలూరు పట్టణంలో ప్రస్తుతం ఉన్న గేట్లు కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నందున ఎన్.హెచ్-16 పై రైల్వే అండర్ బ్రిడ్జ నిర్మాణం. ప్రధాన రైల్వే స్టేషన్లలో కోవిడ్ సమయంలో ఉన్న రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించడం, ముఖ్యంగా పల్లేవాడ హాల్ట్, నూజివీడు స్టేషన్‌లకు మరింత ఎక్కువ స్టాప్‌లను కేటాయించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

అమృత్ భారత్ స్టేషన్ ప్రాజెక్ట్ కింద ఆంధ్రప్రదేశ్‌లో 73 రైల్వే స్టేషన్లు అభివృధ్ధికి ఎంపిక చేసి, వీటి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, అలాగే రైల్వే వ్యవస్థ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, ఏలూరు వ్యవసాయ కేంద్రంగా ఉన్నందున రవాణా సౌకర్యాలు మెరుగుపడితే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో త్వరగా మార్కెట్‌కు తరలించి గిట్టుబాటు ధర పొందడానికి వీలుందని ఎంపీ తెలిపారు. మరొక ముఖ్యమైన ప్రాజెక్ట్ అమరావతి రైల్వే లైన్ మంజూరు చేయడం వల్ల రాష్ట్ర రాజధాని అమరావతిని దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాలు, సముద్ర తీర ప్రాంతాలతో అనుసంధానిస్తుందని, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించ డంతో పాటు, పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడుతుందని ఎంపీ మహేష్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌లో భారతీయ రైల్వేలకు రూ. 2,55,445 కోట్లు కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు.

## పశువుల దొంగతనం కేసును ఛేదించిన భీమడోలు పోలీసులు



**భీమడోలు, మేజర్ న్యూస్ :** మండలంలోని కురెళ్ళగూడెం గ్రామంలో ఈనెల 22వ తేదీన జరిగిన పశువుల దొంగతనం కేసును ఛేదించినట్లు భీమడోలు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరూ అంతర్ జిల్లాల దొంగలను పట్టుకొని,చోరీ సరుకు తరలించేందుకు ఉపయోగిస్తున్న మోటార్ వాహనంతో పాటు,రూ.2.50 లక్షల విలువ గల చోరీ సొత్తును స్వాధీనపర్చుకున్నామన్నారు. వారు తెలిపిన వివరాల మేరకు పల్నాడు జిల్లా కల్వకుంట గ్రామానికి చెందిన సూదెనబోయిన నరసయ్య, అదే జిల్లా పిడుగురాళ్ల కు చెందిన కుంచపు దుర్గాప్రసాద్ ఈనెల 22వ తేదీన కురెళ్ళగూడెం గ్రామంలో రోడ్డు పక్కన షెడ్‌లో గల అదేగ్రామానికి చెందిన పెండ్యాల కిషోర్ కు చెందిన రెండు గేదెలు ,రెండు దూడలను ఈనెల 22వ తేదీ రాత్రి దొంగిలించి తరలించుకుపోయారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై సుధాకర్ జిల్లా ,డివిజనల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ,భీమడోలు సిఐ యుజె విల్సన్ పర్యవేక్షణలో దర్యాప్తును ప్రారంభించారు. మంగళవారం దొంగిలించిన సరుకును మోటార్ వాహనంలో జాతీయ రహదారి మీదుగా తరలిస్తున్న వాహనంతో పాటు, చోరీ సొత్తును,నిందితులను అదుపులోనికి తీసుకున్నారు. వీరిలో గతంలో నరసయ్య పై ఒక కేసు,దుర్గాప్రసాద్ పై 12 కేసులు ఇతర ప్రాంతాల్లో నమోదై ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

## శ్రీ పెద్దింట్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రత్యేక పూజలు



**దెందులూరు,మేజర్‌న్యూస్:**దెందులూరు గ్రామంలోని శ్రీ పెద్దింట ్లమ్మవారి 46వ తీర్థ మహొత్సవాల్లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొని నియోజకవర్గ ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేనికి ఉత్సవ కమిటీ నిర్వాహక సభ్యులు,స్థానిక కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు.

## నవోదయకు ఎంపికైన విద్యార్థులు



**కైకలూరు, మేజర్ న్యూస్,** జవహర్ నవోదయ విద్యాలయం 2025-2026 విద్యా సంవత్సరానికి నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ ఫలితాల్లో కైకలూరు పట్టణంలోని భాష్యం పాఠశాలకు చెందిన కే. రేవంత్ నాగసాయి,శ్రీ చైతన్య పాఠశాలలకు చెందిన చిన్నం తన్వికలు మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఎంపికయ్యారు. జనవరి 18న జరిగిన ప్రవేశ పరీక్షలకు హాజరై అత్యధిక మార్కులు సాధించి ఈ సీటు కైవసం చేసుకున్నారు. నవోదయ విద్యాలయానికి ఎంపిక కావడానికి ఉపాధ్యాయులు దత్తు మాస్టర్ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నాగ సాయి తల్లి సీతా కుమారి,తండ్రి రవికుమార్ కైకలూరులో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. తన్విక తల్లి ఉపాధ్యాయురాలిగా,తండ్రి గన్ మాన్‌గా చేస్తున్నారు. ఈ సందర్భంగా సాయి, తన్వికలు మాట్లా డుతూ నవోదయ కు ఎంపిక కావడానికి శిక్షణ ఇచ్చిన దత్తు మాస్టర్‌కి, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# నూతన హంగులతో కార్పొరేషన్ మినీ కాన్ఫరెన్స్ హాల్






– ప్రారంభించిన ఎమ్మెల్యే బడేటి,మేయర్ నూర్జహాన్ పెదబాబు

ఏలూరు,మేజర్ న్యూస్ : మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నూతన హంగులతో రీ మోడల్ చేసిన మినీ కాన్ఫరెన్స్ హాల్ ను శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య,నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనస భ్యులు బడేటి చంటి మాట్లాడుతూ కాన్ఫరెన్స్ హాలు ఎంతో సుందరంగా ఉందన్నారు. అయితే ప్రజాప్రతినిధులందరూ వారి డివిజన్లను కాన్ఫరెన్స్ హాల్ ఉన్నంత సుందరంగా తయారు చేయాలన్నారు. వచ్చే వర్షాకాలంికి ప్రజలు రోడ్లు,డ్రైన్లు సమస్యల గురించి మన వద్దకు రాకుండా చూసుకోవాలన్నారు. మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ గతంలో కౌన్సిల్ హాల్ ఇప్పుడు నూతన హంగులతో కాన్ఫరెన్స్ హాల్గా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్లో ఏడు పంచాయతీలు విలీనం కావడంతో కార్పొరేషన్లో జనాభా పెరగడం. అధికారులు సిబ్బంది పెరగడం జరిగిందన్నారు. కార్పొరేషన్లో ఉన్న 7 సెక్షన్ల అధికారులు,సిబ్బంది,అంతేకాకుండా సచివాలయాలకు సంబంధించిన సిబ్బందితో ఎప్పటికప్పుడే రివ్యూలు నిర్వహించుకోవడానికి ఈ మినీ కాన్ఫరెన్స్ హాల్ ఉపయోగించడం జరుగుతుందని మేయర్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ హాల్ ఎంతో సుందరంగా తీర్చిదిద్దిన కాంట్రాక్టర్ మాలిక్ అతని కుమారుడు అమీర్లను నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు బొకే ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ భాను ప్రతాప్,అదనపు కమిషనర్ జి.చంద్రయ్య,ఎంఈ సురేంద్రబాబు,డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు,వందరానీ దుర్గాభవాని శ్రీనివాస్,కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, జాల సుమతి బాలాజీ, కార్పొరేటర్లు వంకదారు ప్రవీణ్,జిన్నూరు కనక నరసింహా రావు,దేవరకొండ శ్రీనివాసరావు, కల్వకొల్లు సాంబ,అర్జీ సత్యవతి నాగేశ్వరరావు,పాము శామ్యూల్,ఈదుపల్లి పవన్,బత్తిన విజయ కుమార్,సబ్బన శ్రీనివాసరావు,జనపరెడ్డి కృష్ణతదితరులు పాల్గొన్నారు.

# మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్సీ జయమంగళ



కైకలూరు,మేజర్ న్యూస్ : చిరు వ్యాపారి ఐస్ క్రీములు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న వ్యక్తి భీమవరం నుంచి వస్తూ అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కైకలూరు మండలం గోనిపాడు గ్రామం హైవే రోడ్డుపై ఆగి ఉన్న సెప్టిక్ ట్యాంక్ వాహనాన్ని ఢీ కొట్టి తలకు బలమైన గాయం అవ్వడంతో రోడ్డుపై స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తిని చూసి అదే సమయంలో కొట్టాడ గ్రామంలో వడ్డీ సాధికారిక కమిటీ చైర్మన్ భలే యేసు రాజు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న వెంకటరమణ కైకలూరు వస్తూ మార్గ మధ్యలో వ్యక్తి పడిపోయి ఉండడాన్ని చూసి అతనిని ఆదుకొన్నారు. తన వ్యక్తిగత సహాయకుడు ద్వారా అతని లేపి వివరాలు తెలుసుకొని కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తరలించి చికిత్స అందించారు. తీవ్ర రక్తస్రావం ఎడమకాలు విరిగినట్లు వైద్యులు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో తనకెందుకులే అనుకోకుండా మానవత్వంతో ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడటమే ముఖ్యం అనే విధంగా నిత్యం ప్రజల్లో ఉండే ప్రజల శ్రేయస్సు కోరుకునే నాయకుడిగా ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ చేసిన మంచి పనిని అందరూ అభినందించారు.

# రైతులు సమస్యలు తీర్చడానికే పొలం పిలుస్తోంది





**– జేసి టి.రాహుల్ కుమార్ రెడ్డి**

**పెంటపాడు,మేజర్ న్యూస్ :** జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పెంటపాడు మండలం ఆకుతీగపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాల ద్వారా వరి పొలాలు సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించడం, రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడటం, లాభసాటి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడం, తదితర అంశాలను వివరించడం జరుగుతుందని అన్నారు. అలాగే కోత దశకు వచ్చిన వరి పొలాలు 80 శాతం గింజలు గట్టిపడిన తరువాత కోత కోసి రెండు రోజులు పనలు ఆరబెట్టి 17 శాతం తేమ వచ్చిన తరువాత రైతు సేవా కేంద్రాలకు రైతులు ధాన్యమును తీసుకురావాలని అన్నారు. పిఎండిఎస్ నవధాన్యాలు సాగుకు సంబంధించి పచ్చి రొట్ట పైరు విత్తనాలును 10 కేజీలు ప్యాకెట్లు రూ.700 లు చొప్పున రైతులకు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అందించడం జరిగింది. రబీ సాగు కోత కోయక ముందు పచ్చి రొట్ట విత్తనాలను చిమ్మాలన్నారు. ఈ సందర్భంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి రైతులు పలు సమస్యలను వివరించారు. చిరిగిన గోనే సంచులు ఎక్కువగా వస్తున్నయని వాటి వల్ల ఇబ్బంది కలుగుతుందని అన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మిల్లులు వద్ద నుండి వచ్చే సంచులకు నంబర్లు ఇవ్వడం జరుగుతుందని,వచ్చిన సంచులకు నెంబర్లు ఇవ్వడం వలన వాటి స్థానంలో తిరిగి కొత్త సంచులను తీసుకోవటం జరుగుతుందని అన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ముదునూరుపాడు గ్రామం వద్ద రైతులు కోసిన వరి పొలాలు ఎక్సెల్ పది రకం ధాన్యమును జిల్లా జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఖతీబ్ కౌశల్ భానో,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ,ఏవో కె.పార్థసారథి, తహశీల్దార్ సీతారత్నం, ఎంపిడిఓ,ఎం ఎల్ ఓ రవి,గ్రామ సర్పంచ్ డి.వెంకటేశ్వర్లు,ఎంపీటీసీ కె.వెంకట్రావు, నీటి సంఘం అధ్యక్షులు ఎం.సూర్యచంద్రరావు, బాబు, ధనరాజ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 324 దేశాల కలశాలతో మహిళల ఊరేగింపు



తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ : ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అద్వర్యంలో ఆలయ నిర్వాకులు శ్రీరంగం రామాంజనేయులు గ్రామ దేవత బలుసులమ్మ ఆలయంలో ఉగాది మహోత్సవం లో భాగంగా అమ్మవారికి మంగళవారం ఆలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఘనాపాటి ఫణిశర్మ ఆలయ అర్చకులు విగ్నేస్వర పూజ నిర్వహించి పంచామృత ద్రవ్యాలతో వివిధ పుణ్య నది జలములచే అష్టోత్తర కలశములకు సంప్రోక్షణ ఆరాధన చేసి 324 కలశములను మహిళలచే సన్నాయి వాయి ధ్యాలతో పాతూరు పుట్టింటి బలుసులమ్మ తల్లి ఆలయంకు, పురవీదులలో ఊరేగింపుగా ఆలయంకు తీసుకుని వచ్చి అమ్మవారికి, శిఖరంలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్ద ప్రసాదంలు అందించారు. ఈ కార్యక్రమంలో సుంకర ధన బాబు, కర్రి జయప్రకాష్, దాట్ల జగన్నాధ రాజు, నీలం సురేష్, చవ్వాకుల రమణ, మహిళ భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్ఎస్సి డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానుయేల్ జన్మదిన వేడుకలు



**ఏలూరు, మేజర్ న్యూస్ :** స్థానిక జేవియర్ నగర్లోని ఏలూరు ఆర్ సిఎం డయాసిస్ లో గల సోషల్ సర్వీస్ సెంటర్ (ఎస్ఎస్సి) డైరెక్టర్ రెవ.ఫాదర్ తాతపూడి ఇమ్మానియేల్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ తరపున మహిళలకు చీరలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఫాదర్ ఇమాన్యుల్ నీతి,నిజాయితీకి నిలువుటద్దమని,కరోనా సమయంలో,విజయవాడ పోలవరం, కుక్కునూరు,తదితర ప్రాంతాల్లో వరద బాధితులకు ఎనలేని సహాయ కార్యక్రమాలు చేశారని తెలిపారు. ఫాదర్ ఇమ్మానుయేల్ పేదలపాలిటీ పెన్నిది అని, ఎంతోమంది పేద విద్యార్థినీ, విద్యార్థులకు చదువులకి సహాయ సహకారాలు అందించిన మహనీయులని వరప్రసాదరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అబ్రహం మాస్టర్, సోషల్ సర్వీస్ అకౌంటెంట్ మాథ్యూ జక్కుల బెనర్జీ, జాన్ గురునాథం, పొలిమేర హరికృష్ణ, కలపాల రవి, మేతర అజయ్ బాబు,ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, కలతోటి డోమినిక్,దీన గ్లాడి,డాక్టర్ ఎన్.కృపానందం వీరస్వామి, పలు సంస్థల అధినేతలు, సిస్టర్లు, ఫాదర్స్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రెవ. ఫాదర్ తాతపూడి ఇమాన్యుల్ ఘనంగా సత్కరించారు.

### ప.గో.జిల్లా పరిషత్ స్థాయీ సంఘ,సర్వ సభ్య సమావేశాలు వాయిదా

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఈనెల 27వ తేదీన జరగవలసిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ 1 నుండి 7 వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు, సర్వ సభ్య సమావేశం అనివార్య కారణముల వలన వాయిదా వేయడమైనదని జెడ్పి సిఇఓ కె.భీమేశ్వరరావు తెలిపారు. సమావేశం ఏప్రిల్ 4వ తేదీ 1 నుండి 7 వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10గం.ల నుండి ,జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం మద్యాహ్నం 2గం.ల నుండి గౌరవ అధ్యక్షులు, జిల్లా ప్రజా పరిషత్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు వారి అధ్యక్షతన జిల్లా పరిషత్ కార్యాలయం ఏలూరులో నిర్వహించ బడునన్నారు. సమావేశమునకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అందరు జిల్లా ప్రజా పరిషత్ సభ్యులు, మంత్రి, పార్లమెంటు సభ్యులు,శాసన మండలి సభ్యులు,శాసన సభ సభ్యులు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు. ఏలూరు, పశ్చిమ గోదావరి,తూర్పుగోదావరి జిల్లాలోని అందరు అధికారులు హాజరవుతారన్నారు.

# మత విద్వేషాలు రెచ్చగొడుతున్న మోడీ ప్రభుత్వం



ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేషాలు రగిలించి మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య విమర్శించారు. సిపిఐ శత వార్షికోత్సవాలు సందర్భంగా మార్చి 23 నుండి ఏప్రిల్ 14 వరకు సిపిఐ నిర్వహిస్తున్న ప్రసార జాత మంగళవారం సాయంత్రం ద్వారకాతిరుమలలో పర్యటించింది. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ మతోన్మాద చర్యలను ప్రజలందరూ ఐక్యమత్యంగా తిప్పి కొట్టాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో నానాటికి పేదరికం పెరిగిపోతోందని, నిరుద్యోగం తాండవిస్తోంద ని,పెరిగిన నిత్యావసర ధరలతో దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాల ప్రజలను విడగొట్టి ప్రజల మధ్య విభేదాలను సృష్టించ చాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సిపిఐ ఆధ్వర్యంలో సంయుక్త భాషా రాష్ట్రాలను కాపాడుకుంటూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ఎన్నికల సందర్భంగా తాను అధికారంలోకి వస్తే విదేశాలలో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తీసుకు వస్తానన్న హామీ ఇచ్చి, విస్మరించారన్నారు. పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని రాయితీ రూపంలో కట్టబెట్టారని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీని అమలు చేయకపోగా విద్యారంగాన్ని కాషాయకరణకు మోడీ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాల పండుగ జరుపుకుంటుందని తెలియజేశారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్రోద్యమంలో సిపిఐ కీలకపాత్ర పోషించిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుండి ఎలాంటి సహకారం అందడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేయాలని సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ ప్రచార జాతాలో సిపిఐ ఎఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సిపిఐ సిపిఐ నాయకులు గోలిమే బాల యేసు మాండ్రు బాలరాజు యడ్లపల్లి రమేష్, పెండ్లి భూషణం నల్లంటి భద్రయ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి డి.శివకుమార్, జిల్లా నాయకులు కే క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు సహించేది లేదు



పెదవేగి, మేజర్ న్యూస్: ఉపాధి హామీ పనుల్లో అవక తవకలకు పాల్పడితే సహించేది లేదని పెదవేగి సర్పంచ్ తాత శ్రీరామ్ మూర్తి అన్నారు. మండల కేంద్రమైన పెదవేగి సచివాలయంలో మంగళవారం సర్పంచ్ తాత శ్రీరామ్ మూర్తి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2023 వ సంవత్సరం ఏప్రిల్ నెల నుండి 2024 మార్చి నెలాఖరు వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామంలో సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగిందని సామాజిక తనిఖీ బృందం డిఆర్పి సీమరాజు పేర్కొన్నారు.

ఈ గ్రామ సభలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు సామాజిక తనిఖీలో జరిగిన అవకతవకలను గ్రామ సభ ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డిఆర్పి సీమరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో అనేకమంది జీవనాధారం పొందుతున్నారని, కొంతమంది ఈ పనిలో అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని, ఇటువంటి వారి నుండి దుర్వినియోగమైన సొమ్మును రికవరీ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాత సత్యనారాయణ, కంచన మోహన్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పంట పొలాలను పరిశీలించిన ఏడిఈ అనిల్ కుమారి



నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్: మండలంలోని ఎల్‌బి చర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా కటకంశెట్టి గోపాలరావు పొలంలో మినికిట్ ఆర్ యన్ ఆర్ 15018 ,యం టీ యు 1426 రకాలను ఏ డి ఏ ఈ అనిల్ కుమారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ

మినికిట్ రకాలు మంచి దిగుబడులు ఇస్తున్నాయని అలాగే రైతులందరూ కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ మార్చి 31వ తారీకు లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం జిల్లా వైస్ చైర్మన్ గుబ్బల మారాజు, గుబ్బల వీరస్వామి, కటకంశెట్టి మాణిక్యాలరావు, గురవయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# దూబచర్లలో అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండకు నిరసన



చింతలపూడి,మేజర్ న్యూస్: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి దుండగులు చెప్పుల దండ వేసి అవమానించిన ఘటనకు నిరసనగా చింతలపూడిలోని మాలలు–అంబేద్కర్ వాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ వాదులు కల్యాకుర్తి నాగేశ్వరరావు,కాకర్ల సత్యం మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతను అవమానించడం హేయమైన చర్యగా వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏక కులం గా ఉన్న ఎస్సీలను విభజించి తమ రాజకీయ లబ్ధికోసం పబ్బం గడుపుకుంటున్నారని,తక్కువ జనాభా నిష్పత్తి కలిగిన మాదిగలను ఎక్కువగా చూపించి,ఎక్కువ జనాభా నిష్పత్తి గల మాలలను తక్కువగా చూపించి మాలలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణ శాస్త్రయుక్తంగా లేదని, కొత్తగా జనాభా లెక్కలు తీసి నిష్పత్తిని బట్టి వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంచర్ల బుచ్చిబాబు,దారా. వీరేంద్ర, మద్దా. ఆనంద్ (పండు), నాగదేసి ఆనంద్, నిమ్మగడ్డ అశోక్ కుమార్,నక్క రవి,మారుమూడి రవికుమార్,దొంతమల అజయ్,దారా పేరాజు,కొవ్వూరు వెంకటేశ్వర రావు, ఎస్ నాగరాజు,బాలకృష్ణ, సాకా.వెంకన్న బాబు పాల్గొన్నారు.

# చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



పెదపాడు,మేజర్ న్యూస్ : పై ఫోటోలో ఉన్న వ్యక్తి అప్పనవీడు గ్రామంలో ఎంఆర్‌సి కాలనీ గ్రామ పంచాయతీ చెరువులో గుర్తుతెలియని వ్యక్తి పడిపోవడం వలన చనిపోయాడు అతని వయసు 30 సంవత్సరాల నుండి35 సంవత్సరాల మధ్య ఉంటుంది అతను 5.5 ఎత్తు నలుపు రంగు జుట్టు నలుపు టీ షర్టు జీన్స్ ప్యాంటు వేసుకుని అన్నాడు పై ఫోటో చూసి గుర్తిం చని యెడల పెదపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐకి 9440796637 ఫోన్ చేయవలసిందిగా కోరారు.

# రూ 62 లక్షలతో కొత్తపల్లిలో మంచినీటి పథకం నిర్మాణానికి భూమి పూజ



ముదినేపల్లి,మేజర్‌న్యూస్ : ముదినేపల్లి మండలంలోని వణుదుర్రు శివారు కొత్తపల్లి గ్రామంలో మంచినీటి పథకం నిర్మాణానికి కైకలూరు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీ రమల్లు నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ నాయకులు కలసి భూమి పూజ చేసారు. ఈ పథకానికి జల్ జీవన్ మిషన్ నుండి రూ 62 లక్షలు మంజూరు అవ్వడంతో పనులకు శ్రీకారం చుట్టారు. ఈ గ్రామంలోని పథకానికి మంచినీటి చెరువు, సంప్, మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేయనున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు ఈ పథకం దోహదపడుతుందని నాయకులు వివరించారు. ఈ కార్యక్రంలో సర్పంచ్ చిన్నం సుగుణ బాబు, పంచాయతీ కార్యదర్శి ఎన్ సునీల్ కుమార్, నాయకులు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ, మండల జనసేన పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర అధ్యాపకునికి డాక్టరేట్ -అభినందించిన యాజమాన్యం





నర్సాపురం రూరల్, మేజర్‌న్యూస్ :మండలంలోని సీతారామపురం లోగల స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో సి.ఎస్.ఇ. విభాగములో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేయుచున్న నేతల తులసీరాజు డాక్టరేట్ సాధించినారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన "గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ" నుండి వైస్ ఛాన్స్ లర్ డాక్టర్. ఏ.వి.ఎన్. ఎల్.శర్మ చేతుల మీదుగా తులసీరాజు పి. హెచ్.డి.పట్టా అందుకున్నారు. ప్రొఫెసర్.డాక్టర్. బిదూష్ కుమార్ సాహు, స్వర్ణాంధ్ర కళాశాల సి.ఎస్.ఇ. హెచ్.ఓ.డి. డాక్టర్.పి.శ్రీనివాసులు పర్యవేక్షణలో "ఎన్ ఆప్టిమైజ్డ్ మైక్రో ఎర్రే డాటా ఎక్స్ట్రాక్షన్ అండ్ క్యాన్సర్ క్లాసిఫికేషన్ యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్" అనే అంశం పై చేసిన పరిశోధనకు గాను తులసీరాజుకు డాక్టరేట్ లభించినది.

ఈ సందర్భముగా స్వర్ణాంధ్ర విద్యా సంస్థల ఛైర్మన్ కె.వి సత్యనారాయణ,ట్రెజరర్ కొండవీటి వెంకటేశ్వర స్వామి డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డా.ఎస్.సురేష్ కుమార్,వైస్ ప్రిన్సిపాల్ డా ఏ గోపిచంద్ వివిధ విభాగాధిపతులు స్వర్ణాంధ్ర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులతో పాటు గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.వి.జి.రావు, క%శీ%ట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా.పి.విజయ కుమార్ తదితరులు అభినందించారు.

# విద్యార్థులకు క్రీడ వస్తువులు పంపిణీ చేసిన దాత కెవిఆర్ సత్యనారాయణ



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** అన్ని దానాలు కన్నా విద్యా దానం గొప్పదని, విద్యార్థులకు నైతికతో కూడిన విద్యనందించడమే కాక వారిలో శారీరక మానసిక దృఢత్వాన్నిమెరుగుపరచుటకు క్రీడలు దోహదపడతాయని అందుకే విద్యార్థులకి కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేయటం కాకుండా వారికి గేమ్స్ స్పోర్ట్స్ కు సంబంధించిన సామగ్రిని కూడా అందజేయడం జరిగిందని జంగారెడ్డిగూడెం సామాజిక కార్యకర్త, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కె.వి.ఆర్ సత్యనారాయణ (రాము ) పేర్కొన్నారు. మంగళవారం వంకవారి గూడెం వాల్మీకి విజ్ఞాన్ కేంద్రం పాఠశాలలో తన పుట్టినరోజు సందర్భంగా 1000 లీటర్లు కెపాసిటీ సింథటిక్ ట్యాంకు, రెండు వాలీబాల్ సెట్లు, రెండు క్రికెట్ కిట్లు, షటిల్ బ్యాట్లు, చెస్ బోర్డులు, వైకుంఠపాళీ కిట్లు, పెన్నులు, 20 జతలు కోలాటం కర్రలు అందజేసినారు. ఈ సందర్భంగా గురువులకి నూతన వస్త్రాలతో సత్కారం చేశారు. విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందించి విందు ఏర్పాటు చేశారు. తమ పాఠశాలకు ఇన్ని సౌకర్యాలు అందించిన దాత కెవిఆర్ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పాఠశాల అడ్మినిస్ట్రేషన్ అధికారి తనికెళ్ళ సత్య రవికుమార్ పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో వాల్మీకి విజ్ఞాన్ కేంద్రం పాఠశాల పరిపాలన అధికారి తని కె ళ్ల సత్య రవికుమార్, కుంచ్చాడా దుర్గాప్రసాద్,, బి విశ్వనాథ్, సాయిబాబా, నారాయణమూర్తి, ప్రధానోపాధ్యాయులు ఎంఎస్సీ సుబ్రహ్మణ్యం, వేదుల జనార్దన్ రావు, గ్రామ ఉపసర్పంచ్ వి శేషగిరి, రాఘవరావు, తులసి వి కాళేశ్వరి, కే గౌరి శ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు పన్నులు రద్దు చేయండి.. కూనపరెడ్డి



**నరసాపురం, మేజర్ న్యూస్ :** చిరు వ్యాపారులు కుటుంబ పోషణ కోసం, రోజువారి వడ్డీలకు తెచ్చుకుని వ్యాపారం కొనసాగిస్తున్నారని అటు వంటి వారికి పట్టణములో వసూళ్లు చేస్తున్న పన్నుల నుండి మినహాయింపు ఇవ్వాలని వైయస్ పాలెం మాజీ సర్పంచ్ కూ నప రెడ్డి వీర వెంకట విజయ రంగారావు అధికారులను కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య, చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ లకు వినతి పత్రం అందించారు. పట్టణానికి చెందిన అనేకమంది గ్రామాలు వచ్చి వ్యాపారాలు చేస్తున్నారని, వారి దగ్గర నుండి ఎటువంటి పన్నులు వసూళ్లు చేయడం లేదని ఆయన తెలిపారు.

గ్రామాల నుండి పట్టణాలు వచ్చి చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్న వారి దగ్గర పన్నులు వసూళ్లు చేయటం సమంజసం కాదన్నారు. మానవతా దృక్పథంతో చిరు వ్యాపారులకు, ముఖ్యంగా గ్రామాల నుండి వచ్చి పట్టణంలో వ్యాపారం చేసుకునే వారికీ పన్నుల నుండి మినహాయింపు ఇవ్వాలని ఈ విషయాన్ని కౌన్సిల్లో చర్చించి మీ నిర్ణయం తీసుకోవాలని రంగారావు కోరారు.

## 1 నుండి సదరం స్లాట్ ప్రారంభం

**ఇరగవరం,మేజర్ న్యూస్ :** జిల్లాలో నిలిపివేయబడిన సదరం ఆన్లైన్ ప్రక్రియ పునప్రారంభమైనట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.శ్రీనివాస్ తెలిపారు. సదరం స్లాట్ ఏప్రియల్ 1వ తేదీ నుండి ప్రారంభంమౌతాయని తెలిపారు. ఈ స్లాట్లు ఎంపికచేసిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి,జిల్లా ఆసుపత్రులు, జి.జి.హెచ్ తదితర ఆసుపత్రులలో క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు.

## మార్కెట్ వేలంపాట వాయిదా



నరసాపురం,మేజర్న్యూస్ : పట్టణంలోని రోడ్డుపైన వ్యాపారం చేసుకునే వారి వద్ద నుండి రోజువారి పన్నులు వసూలు చేసుకునేందుకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పాట ఏర్పాటు చేశారు. 2025జ 26 సంవత్సరానికి చేపల మార్కెట్తో సహా పన్నుల వసూళ్లకు పాట నిర్వహించారు.

ప్రభుత్వ పాట ధర రు 72 లక్షల 80వేలుగా నిర్ణయించి పాట ప్రారంభించారు. పాడుకునేందుకు కొంతమంది హాజరైనప్పటికీ ఎవరు మాట్లాడలేదు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ఎక్కువగా ఉన్నదని, దీనితోపాటు ఈ ఏడాది జీఎస్టీ కలవడంతో వసూళ్లు చేయటం కష్టమవుతాదని మున్సిపల్ కమిషనర్ కోరారు.

కొంతసేపు వేచి ఉన్న తర్వాత వాయిదా వేస్తూ, తిరిగి ఈనెల 29న 11 గంటలకు పాట నిర్వహిస్తామని కమిషనర్ ఎం అంజయ్య తెలిపారు. ఆర్ఐ అడ్డాల నానాజీ, సాగర్, విశ్వం తదితరులు నిర్వహణలో పాల్గొన్నారు.

# ద్వారకా తిరుమలలో కోకో రైతుల నిరసన

### రైతుల వద్ద ఉన్న గింజలు వెంటనే కొనుగోలు చేయాలి



**ద్వారకాతిరుమల, మేజర్న్యూస్:** కోకో రైతుల వద్ద ఉన్న ఆన్ సీజన్ కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం కోకో రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు బొబ్బా రమేష్, నిడదవోలు సుబ్బారాయుడు మాట్లాడుతూ ఈ సంవత్సరం కోకో రైతులకు తగిన ధర రాక, కంపెనీలు గింజలు కొనుగోలు చేయక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోకో తోటలు కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి దయనీయ మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

కోకో గింజలు పచ్చుళ్ళు పట్టుకోండి అంటూ కొన్ని కంపెనీల ప్రతినిధులు రైతులను ఎగతాళి చేస్తూ రైతులను అవమానించడం దారుణమని విమర్శించారు. గత నెల రోజులుగా రోడ్లెక్కి కోకో రైతులు ఆందోళన చేస్తున్నారని అయినా కంపెనీల నుండి తగిన స్పందన లేదన్నారు. అన్ సీజన్ కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. విదేశీ కోకో గింజలు దిగుమతులు నిలుపుదల చేయాలని కోరారు. అనంతరం మండల డిప్యూటీ తహసిల్దార్ దుర్గా మహాలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పర్సా ధర్మరాజు,ఆర్.సుభాష్ రాజు, మహేశ్వరరావు,ఎం.వీర్రాజు,పలువురు కోకో రైతులు పాల్గొన్నారు.

## ఉగాది వేడుకలకు శ్రీవారి ఉగాది మండపం ముస్తాబు



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్ :** ఉగాది వేడుకలను ఘనంగా జరిపేందుకు దేవస్థానం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. శ్రీవారి ఆలయ ప్రధాన ఆర్చ్ గేటు వద్ద ఉగాది మండపాన్ని కి రంగులు వేసి విద్యుద్దీపాలను కారణాలు పనులు ప్రారంభించారు. ఈనెల30వ తేదీన శ్రీ విశ్వా వసు నామ సంవత్సర ఉగాది నాడు శ్రీ స్వామివారు ఉభయదే వేరులతో మండపంలో కొలువై భక్తులకు దర్శనమిస్తారు. అర్చకులు, పండితులు, పంచాంగ శ్రవణం, తర్వాత పండితుల సత్కారము జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్ వి ఎస్ ఎన్ మూర్తి తెలిపారు. భక్తులు నిబంధనలు పాటిస్తూ స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ అధికారులు తెలిపారు.

## సమస్యపై స్పందించిన కమిషనర్



**నరసాపురం, మేజర్ న్యూస్ :** స్థానికసిద్దాని వారి వీధిలో మురికి నీరు రోడ్డుపైకి వస్తుంది అని స్థానికులు మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్యకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించి ఆ ప్రాంతానికి వెళ్లి డ్రైన్లు శుభ్రం చేయించారు. వెంటనే స్పందించి సమస్య పరిష్కరించిన కమిషనర్ కు శానిటేషన్ సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు ఈనెల ఆఖరు నాటికి చెల్లించాలని కమిషనర్ కోరారు. అటువంటి వారికి అపరాధ రుసుములో 50% తగ్గించేందుకు ప్రభుత్వం అనుమతిని ఇచ్చిందని, దీనిని వినియోగించుకుని సకాలంలో పన్నులు చెల్లించాలని కమిషనర్ కోరారు. ఈకార్యక్రమంలో సానిటరి ఇన్స్పెక్టర్ వేంద్ర ప్రసాద్. పాత్రుడు సానిటరి మేస్త్రి కిషోర్ సచివాలయ సిబంది పాల్గొన్నారు.

## 1నుండి ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం స్లాట్లు ప్రారంభం



**నరసాపురం,మేజర్న్యూస్:** ఇప్పటివరకు నిలిచిపో యిన దివ్యాంగుల సదరం స్లాట్లు ఏప్రిల్ ఒకటి నుండి పున ప్రారంభం కానున్నాయి. నర్సాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ కార్యక్రమం నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ డా. ఏ.సిరి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో దివ్యాంగుల పెన్షనర్ల వెరిఫికేషన్ కారణంగా జనవరిలో విడుదల కావలసిన సదరం స్లాట్లు నిలిపివేయబడ్డాయని తెలిపారు దివ్యాంగ సంఘాల విజ్ఞప్తుల మేరకు, వెరిఫికేషన్తో పాటు స్లాట్లను తిరిగి ప్రారంభి ంచి, అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నామని ఆ ప్రకట నలో వివరించారు. ఈ స్లాట్లు ఎంపిక చేసిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రి,, టీచింగ్ ఆసుపత్రులు జిజిహెచ్లలో ప్రతి మంగళవారం అందుబాటులో ఉంటాయన్నారు.

# కొత్త డిపాజిట్లు తీసుకోం - రుణాలు ఇవ్వం,రెన్యూవల్ చేయం

**- సొసైటీ సమావేశంలో ఇంచార్జ్ చైర్ పర్సన్ మాధవి వెల్లడి**



**టి.నర్సాపురం,మేజర్ న్యూస్ :** టి.నర్సాపురం సహకార సంఘ జనరల్ బాడీ సమావేశం మంగళవారం జరిగింది. సొసైటీ ఇంచార్జ్ చైర్ పర్సన్,డిసిసిబి జిఎం ఏ మాధవి మూర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది. లాభనష్టాల ఖాతాను సభ్యులకు సొసైటీ ఇంచార్జ్ చైర్ పర్సన్ మాధవి మాట్లాడుతూ సంఘము నందు కొత్త డిపాజిట్లు తీసుకోవడం గాని,కొత్త గా రుణాలు ఇవ్వడంగాని, ఇప్పటికే గడువు తీరిన డిపాజిట్ ఖాతాలకు రెన్యువల్ చేయడంగానీ వీలు పడదని తెలిపారు. డిపాజిట్ బాండ్లను లోనింగ్ ఖాతాలో జమ చేసుకోవడానికి వెసులుబాటు ఉందని వివరించారు. రైతుల దగ్గర నుంచి సుమారు 67 కోట్ల రూపాయలు బాకీలు రావలసి ఉన్నాయని,ఈ బ్యాంకు నుంచి సెంట్రల్ బ్యాంకుకు సుమారు 110 కోట్లు రూపాయలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. డిపాజిట్ దారులకు చెల్లించవలసిన సొమ్ము సుమారు రూ.14 కోట్ల వరకు ఉందని,ఇంకా నికర నష్టం సుమారు 57 కోట్ల రూపాయల వరకు ఉంటుందని సంఘ సభ్యులకు మాధవి వివరించారు.సంఘ కార్యదర్శి ఎం.అగస్టిన్ మాట్లాడుతూ 40 లక్షల రూపాయల బాండ్లను సొసైటీ లోనే ఉన్నాయని, బాండ్ల మీద ఉన్న ఫోన్ నెంబర్లకు ఎన్నిసార్లు చేసిన ఎవరు స్పందించడం లేదని, ఆ బాండ్లకి సంబంధించి ఆధార్ కార్డులు లేవని బాండ్లు ఎవరియో కూడా తెలియని పరిస్థితుల్లో ఉన్నామని సంఘ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పర్సన్ సభ్యులతో పాటు రైతులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తుంది సేవలను రైతులు వినియోగించుకోవాలి



**భీమడోలు,మేజర్ న్యూస్ :** వ్యవసాయ శాఖ, దాని అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తుంది కార్యక్రమం సేవలను రైతులు వినియోగించుకోవాలని, వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు యు ఆర్ కుమారి కోరారు. కురెళ్ళ గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పాతూరు రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం భీమడోలు వ్యవసాయ అధికారి ఉషారాణి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్లో రైతులకు ఇబ్బంది లేని విధంగా రానున్న ధాన్యం కొనుగోలు కు అవసరమైన ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాల ఫలాలను పొందేందుకు 11 అంకెల విశిష్ట సంఖ్య వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ మేరకు సహాయ సహకారాలు అందించేందుకు రైతు సేవా కేంద్రం సిబ్బంది సిద్ధంగా ఉన్నారం న్నారు. అనంతరం రాయితీపై అపరాల విత్తనాల అమ్మకాలను సహాయ సంచాలకులు ప్రారంభించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు షైలు భాను పాల్గొన్నారు.

# సెక్యూరిటీ డిపార్ట్మెంట్ సిబ్బందికి ఫిజికల్ టెస్ట్



తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ : తాడేపల్లిగూడెం, వాకర్స్ గ్రౌండ్లో గేల్ ఇండియా లిమిటెడ్కి చెందిన సెక్యూరిటీ డిపార్ట్మెంట్ (మాజీ సైనికులు) సాగర్ కుమార్ (సీనియర్ ఆఫీసర్) ఆధ్వర్యంలో ఫిజికల్ టెస్ట్ నిర్వహించబడింది. ఈ పరీక్షలో పరుగు,సీటప్స్, బెండ్ స్ట్రచ్,ఇతర వ్యాయామాలు చేయించడం జరిగింది.

ఈ సందర్భంలో సాగర్ కుమార్ సెక్యూరిటీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ మాజీ సైనికులు ఎప్పుడు కూడా క్రమశిక్షణ తోను,ఆరోగ్యవంతం గాను ఉండాలని, సమాజానికి ఎప్పుడు ఎటువంటి డిజాస్టర్ సమయంలో అయినా ముందుగా సహాయపడటానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రాధాకృష్ణ, సూపర్వైజర్ ఉడిముడి రాజు,వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలు చేశారు - బహిరంగ క్షమాపణ చెప్పండి

**- మచ్చలేని ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసినవారిని క్షమించం**
**- వ్యతిరేకంగా రాసిన పత్రికలు,వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలి**



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** మచ్చలేని నాయకుడు, ఆపదలో ఉన్నాను అంటే ఆదుకునే నిగర్వి పోలవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ రాష్ట్రంలో నెంబర్ వన్గా నిలిపిన యంగ్ డైనమిక్ లీడర్ పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజుకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక కక్షగట్టి విష ప్రసారం చేస్తూ తప్పుడు రాతలు రాసిన పత్రికలు, చానళ్ళు, వైసిపి నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జీలుగుమిల్లిలోని తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న గ్రౌండ్లో పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పై అసత్య ప్రసారాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము,అడప నాగరాజు,ఎంపిటిసి నాలి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని తాటాకులగూడెం గ్రామంలో ఇటీవల వైసీపీ కార్యకర్త గంధం బోసు హత్యకు గురయ్యారు. బోసు హత్యను రాజకీయం చేస్తూ వైసీపీ నాయకులు తమ రాజకీయ ప్రయో జనాలకు వాడు కొన్నారని జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బోసు హత్యకు పోలవరం ఎమ్మెల్యే చిర్రిబాలరాజు,టిడిపి నాయకులు, జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిర్రి వెంకటేశ్వరరావు కు సంబంధం ఉందంటూ పత్రికలో,చానల్ నందు అవాస్తవాలు ప్రచురించారని చెప్పారు. దర్యాప్తు జరగకముందే ఎవరికి తోచింది వారు ప్రసారం చేసేసారని తక్షణమే వారంతా తమ నాయకుడికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా తమ నాయకులపై దుష్ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జీలుగుమిల్లి ఎస్ఐ పి.నవీన్ కుమార్కు కూటమి నేతల ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సుంకవల్లి సాయి, మాజీ జెడ్పిటిసి బాసిన రాజబాబు, రేపాక గోపాలం, పులగం సుబ్బారెడ్డి, ఏడు మండలాల జనసేన పార్టీ ప్రెసిడెంట్లు, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లింగపాలెంలో కోకో రైతుల ధర్నా

**- గింజలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోండి**



**లింగపాలెం,మేజర్ న్యూస్ :** కోకో రైతుల వద్ద ఉన్న కోకో గింజలు వెంటనే కొనుగోలు చేసి కోకో రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం లింగపాలెం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు కోకో రైతులు ధర్నా నిర్వహించారు. కోకో రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ,రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ మాట్లాడారు. కోకో గింజలను కంపెనీలు అతి తక్కువ ధరకు కొనుగోలు చేయడం వలన కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలపు పంట (అన్ సీజన్) కోకో గింజలను కంపెనీలు కొనుగోలు చేయడం లేదని రైతులు వద్ద నిల్వ ఉండిపోవడంతో ఏమి చేయాలో అర్థం కాక కోకో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పరిస్థితులలో అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చి అన్ సీజన్,సీజన్ కోకో గింజలను తక్షణమే కొనుగోలు చేయాలని కోరారు. కంపెనీలు తగిన ధర ఇవ్వకపోతే వ్యత్యాసపు ధరను రాష్ట్ర ప్రభుత్వం కోకో రైతులకు చెల్లించే విధంగా చర్యలు తీసు కుని కోకో రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్ర మంలో వేసంగిసత్యనారాయణ,మోరంపూడి సుబ్రహ్మణ్యం, భాస్క రరావు,సాయిల రాంబాబు పలువురు కోకో రైతులు పాల్గొన్నారు.

# సాంప్రదాయబద్ధంగా ఉగాది ఉత్సవం



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** ఈనెల 30వ తేదీన శ్రీ విశ్వా సమ నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా చిన్న వెంకన్న దేవాలయంను పుష్పాలంకరణ మామి డి తోరణాలతో అలంకరించిన పిద్దప గతంలో ఉన్న సాంప్ర దాయం అనుసరించి గ్రామమునందుగల ఉగాది మండపమునకు 30వ తేదీ సాయంత్రం 6 గంటలకు శ్రీ స్వామివారిని శేష వాహనంపై విచ్చేయుదురు శ్రీ స్వామివారి ఉగాది మండపము వద్ద నిర్వహించు పంచాంగ శ్రవణం అనంతరం పండిత సత్కారం

ఈ దేవాలయం నకు భారి విరాళములు సమర్పించిన దాతలకు సన్మానం నిర్వహించబడునని దేవాలయ ఈవో ఎన్వివిఎన్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం శ్రీ స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించబడునని కావున ఉగాది మండపము నందు నిర్వహించు పంచాంగ శ్రవణమునకు భక్తులు,గ్రామ ప్రజలు విచ్చేయవలసిందిగా తెలియజేశారు.

# 28న ఏలూరులో రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు

**ఏలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశముల ననుసరించి,జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా ఈ నెల 28వ తేదీ సాయంత్రం 6.30 గంటల నుండి గిరిజన భవన్, ఏలూరు నందు ఇఫ్తార్ విందు జిల్లా కలెక్టర్ వారి అధ్యక్షతన నిర్వహించ బడుచున్నది.కనుక జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు,ముస్లిం మత పెద్దలు అందరూ తప్పక విచ్చేయవలసిందిగా కోరుతున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి ఎన్.ఎస్.కృపావరం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.